
సాక్షి బాపట్ల
బుధవారం । 18 । జనవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్:కృష్ణా పశ్చిమ ప్రధానకాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 900 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.1584 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

రేపు కొండవీడులో వేమన జయంతి వేడుకలు

యడ్లపాడు: పల్నాడు జిల్లా కొండవీడు కొండపై వేమన జయంతి వేడుకలు గురువారం నిర్వహించనున్నారు. గుంటూరుకు చెందిన బాలభారతి స్వచ్ఛంద సంస్థ, కొండవీడు అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ వేడుకలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి, డీఎఫ్‌వో ఎన్ రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఉపన్యాసం అనంతరం 'యోగి వేమన పద్యరత్నాలు' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరిస్తున్నట్లు నిర్వాహకులు కె శివారెడ్డి, ఎర్రం సాంబిరెడ్డి తెలిపారు.

20 వరకు రేషన్ బియ్యం

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థలోని ఎండీయూ ఆపరేటర్ల ద్వారా నిర్వహిస్తున్న రేషన్ బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీ ఈనెల 20వ తేదీవరకు పొడిగించటమైందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి మాసానికి ఇంకా రేషన్ సరుకులు తీసుకోని లబ్ధిదారులు తమ ప్రాంతానికి పంపిణీ కోసం వచ్చే ఎండీయూ వాహన ఆపరేటర్ ద్వారా కార్డుపై బియ్యం ఉచితంగా పొందవచ్చన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్డుదారులు తమ సమీపంలో రేషన్‌డీలర్ దుకాణం నుంచి పొందాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1967కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

యార్డుకు 55,670 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 55,670 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 52,402 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.27,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 33,798 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఉపాధికి ఆధారం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

జాబ్‌కార్డుకు ఆధార్‌తో లింక్

- 98.48 శాతం పూర్తి
- రాష్ట్రంలోనే ప్రథమస్థానం
- 'ఉపాధి'లో అక్రమాలకు చెక్
- కూలి పనులకు వెళ్లిన వారికే వేతనాలు
- పని జరిగే ప్రాంతంలోనే హాజరు నమోదు

బాపట్లటౌన్: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన వ్యక్తులు పని చేయకపోయినా... వాళ్లు అసలు పనికి రాకపోయినా ఫీల్డ్ అసిస్టెంట్‌కు వాటా ఇస్తే చాలు వారి అకౌంట్‌లో నగదు జమయ్యేవి.. వచ్చిన సొమ్ములో పర్సంటేజ్ ఇచ్చే వాళ్లు. ఏడాదికొకసారి జరిగే సోషల్ ఆడిట్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ల బాగోతం బయటపడితే ఈ విషయం బయటకు పొక్కకుండా ఆడిట్ బృందానికి మామూళ్లు ముట్ట చెప్పేవారు. ఇది గత ప్రభుత్వం హయాంలో ఉపాధి హామీ పథకం తీరు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ ఈజీఎస్)ను పారదర్శకంగా అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అక్రమాలకు చెక్ పెట్టడంలో భాగంగా కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేస్తోంది. అసలైన కూలీలకు లబ్ధి చేకూరేలా చేపట్టిన ఈ చర్యలు ఇప్పటికే జిల్లాలో 98.48 శాతం పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 3.4 లక్షల జాబ్ కార్డులుండగా, 4,50,296 మంది కూలీలు ఉన్నారు. వారిలో ఇప్పటికీ 4,43,490 మంది వరకు జాబ్‌కార్డు, ఆధార్ కార్డును అనుసంధానం చేశారు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన వ్యక్తులు పూర్తిస్థాయిలో పనుల్లో పాల్గొనక పోయినప్పటికీ కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు బోగస్ రికార్డులు సృష్టించి నిధులు దుర్వినియోగం చేసేవారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతూ ఆధార్ పేమెంట్ బ్రిడ్జి సిస్టం (ఏపీబీసీ) విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.

జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధానం

ఏపీబీసీ అమలులో భాగంగా ఉపాధి హామీ జాబ్ కార్డును కూలీల ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. జిల్లా వ్యాప్తంగా కూలీల మొత్తం



ఆధార్ అనుసంధానం చేస్తున్న సిబ్బంది

వివరాలు సాఫ్ట్‌వేర్‌లో లోడ్ చేసిన తర్వాత శ్రమ శక్తి సంఘాల ఆధ్వర్యంలో రోజువారీగా ఎంత మంది పనులకు హాజరయ్యారనే వివరాలను ఫొటోలతో సహా ఏ రోజుకారోజు క్షేత్రస్థాయి నుంచే మేట్, ఫీల్డ్ అసిస్టెంట్లు అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఆటోమేటిక్ గా ఆ రోజు వేతనం జనరేట్ అవుతుంది. గతంలో మాన్యువల్‌గా కూలీల వివరాలను మస్టర్లలో నమోదు చేసి, ఆ వివరాలను మండల కార్యాలయానికి పంపితే అక్కడ వేతనాలు జనరేట్ చేసేవారు. ఇందులో లొసుగుల ఆధారంగా చేసుకుని కొంత మంది సిబ్బంది చేతివాటం ప్రదర్శించే వారు.

రాష్ట్రంలోనే ముందంజ...

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో బాపట్ల జిల్లా జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేసే ప్రక్రియలో మొదటిస్థానంలో నిలిచారు. జిల్లా కలెక్టర్ కె. విజయకృష్ణన్ ఆదేశాల మేరకు జిల్లా డ్వామా పీడీ శంకర్‌నాయక్ జిల్లాలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ వారికి కావల్సిన మెలకువలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం వలన 98.48 శాతం పూర్తిచేసి రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచారు.

98.48 శాతం ఆధార్ అనుసంధానం



జాబ్ కార్డులకు కూలీల ఆధార్‌తో అనుసంధానం ప్రక్రియ జిల్లాలో 98.48 శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచాం. ఆధార్ కార్డుల్లోని పేర్లకు, జాబ్‌కార్డుల్లోని పేర్లకు సరిపోల్చితే 70 శాతం పైగా పేర్లు తప్పులు తడకగా ఉన్నాయి. జాబ్ కార్డు కలిగిన లబ్ధిదారుల డేటాను సేకరించి వాటిని రేషన్ డీలర్ల వద్ద పేర్ల జాబితాతో సరిపోల్చి పేర్లు తప్పుగా ఉన్నవాటిని సరిచేయించామన్నారు. ప్రస్తుతం చేపట్టిన విధానం వలన ఉపాధి పనుల్లో అక్రమాలకు తావుండదు. ఫీల్డ్ అసిస్టెంట్లు గతంలో పనిచేసిన పాతఫోటోలు అప్‌లోడ్ చేయడానికి కూడా వీలుండదు.

– శంకర్ నాయక్, పీడీ, డ్వామా

45 రోజులు.. 108 కోట్లు!

ఆర్థిక సంవత్సరం మరో 45 రోజుల్లో ముగియనుండటంతో మిగిలి ఉన్న నిధులను ఖర్చుచేసి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. దానిలో భాగంగా 45 రోజులు రోజుకు లక్ష మందికి పనికల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రోజుకు సగటున రూ. 2.40 కోట్లు నిధులు ఖర్చుచేయనున్నారు. 45 రోజుల్లో జిల్లాకు రూ. 108 కోట్లు నిధులు ఖర్చుచేయాల్సి ఉంది. దానిలో భాగంగా రూ.72 కోట్లు మెటిరియల్ కాగా, మిగిలిన రూ.36 కోట్లు కూలీలకు వేతనాల రూపంలో అందజేయనున్నారు.

జిల్లా సమాచారం

మొత్తం మండలాలు	25
మొత్తం పంచాయతీలు	457
జాబ్‌కార్డులు	3.4 లక్షలు
జాబ్‌కార్డుల్లో కూలీల సంఖ్య	6.32 లక్షలు
ఉపాధి పనులపై ఆధారపడి జీవించేవారు	4.50,296
ఆధార్‌సీడింగ్ పూర్తిచేసిన సభ్యులు	4,43,490
మిగిలినవి	6806
పూర్తిచేసిన శాతం	98.48
2022-23 టార్గెట్	74 లక్షల పనిదినాలు
10 నెలల్లో పనులు కల్పించినది	58.24 లక్షల మందికి
ఇప్పటివరకు ఖర్చుచేసింది	రూ. 168 కోట్లు
వేతనాల రూపంలో కూలీలకు అందించినది	రూ. 119.32 కోట్లు
మెటీరియల్ రూపంలో అందించినది	48.69 కోట్లు
రోజుకు సగటున కూలీలకు అందించిన వేతనం	రూ.240
పనిచేసిన వారిలో ఎస్సీలు	36.29 శాతం
పనిచేసిన వారిలో ఎస్టీలు	3.64 శాతం
ఉపాధి పనిచేస్తున్న మహిళలు	1.47 లక్షలు



బాపట్లలోని వ్యవసాయ కళాశాల

వ్యవసాయ పరిశోధనలకు.. అమృతోత్సవం

- ముస్తాబైన 'వ్యవసాయ' కళాశాల ప్రాంగణం
- 21న 75 సంవత్సరాల ఉత్సవం
- రాష్ట్రంలోనే ప్రప్రథమ కళాశాలగా గుర్తింపు

బాపట్ల: స్థానిక వ్యవసాయ కళాశాల అమృతోత్సవానికి ముస్తాబవుతోంది. ఈనెల 21న అమృతోత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైస్‌చాన్సలర్ డాక్టరు విష్ణువర్ధన్ రెడ్డితోపాటు 1200 మంది ప్రతినిధులతో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదీ కళాశాల చరిత్ర

దేశం ఎల్లప్పుడు పచ్చని పైర్లతో కళకళలాడాలి.. విద్యార్థులే శాస్త్రవేత్తలుగా ఎదగాలి.. రైతు ఎల్లప్పుడు సుభిక్షంగా ఉండాలంటే... రైతుకు ఎలాంటి చీడపీడలు సోకని మేలిరకం వంగడాలను అందించాలి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని ఇచ్చేపైర్లను రైతులకు అందించాలన్నదే బాపట్ల వ్యవసాయ కళాశాల లక్ష్యం. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన తరుణంలో కూడా భారతదేశం ఆర్థికంగా నిలబడటానికి ప్రధాన కారణం వ్యవసాయమే. కళాశాల స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులకు ఎన్నో రకాల నూతన వంగడాలతోపాటు వ్యవసాయాన్ని సులభపద్ధతిలో చేసేందుకు వీలుగా ఎన్నో రకాల యాంత్రీకరణ పరికరాలను అందుబాటులోకి తెచ్చిన ఘనత ఈకళాశాలదే.

వ్యవసాయానికి కేరాఫ్..

గుంటూరు జిల్లా బాపట్లకు వ్యవసాయ రంగంలో దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం 1945 జులై 16న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రప్రథమంగా అప్పటి బ్రిటీషు ప్రభు త్వం బాపట్లలో వ్యవసాయ కళాశాలను స్థాపించింది. 1951లో కళాశాలలో ఏజీ ఎంఎస్సీ పీజీ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ కళాశాలలో 1993లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. 1971లో కళాశాల రజతోత్సవాన్ని, 1994లో స్వర్ణోత్సవాలను జరుపుకున్నారు. ఎంతో చరిత్ర కలిగిన కళాశాల కావడంతో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే 47,48 స్నాతకోత్సవాలకు బాపట్లలోనే నిర్వహించారు. ఇప్పుడు అమృతోత్సవానికి ముస్తాబైంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే దాని అనుబంధ శాఖల సహకారం తప్పనిసరిగా ఉండాలి. ఆ విషయంలో రాష్ట్రంలోనే బాపట్ల ప్రథమస్థానంలో ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయ కళాశాలతో దాని అనుబంధ కళాశాలలైన వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల, పోస్ట్ హార్వెస్ట్ కేంద్రం, వరి పరిశోధన కేంద్రం, వ్యవసాయ కళాశాల క్షేత్రం, ఉప్పునీటి పరిశోధన కేంద్రం, జొన్న పరిశోధన కేంద్ర, విస్తరణా శిక్షణా కేంద్రం, జీడిమామిడి పరిశోధన కేంద్రాలన్ని బాపట్లలోనే ఉన్నాయి. నిపుణులైన శాస్త్రవేత్తలు బాపట్లలోనే ఉన్నారు. దేశవ్యాప్తంగా మాగాణి పొలాల్లో రారాజుగా రాణిస్తున్న బీపీటీ 5204 (సాంబమసూరి) రకానికి పురుడు పోసింది బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలోనే.

పూర్వ విద్యార్థులు... అపూర్వ పదవులు!

బాపట్ల వ్యవసాయ కళాశాలకు దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం దేశ, విదేశాల్లో ఐఏఎస్, ఐసీఎస్, ఐఆర్ఎస్ అధికారులుగా కీలక శాఖల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మాజీ చీఫ్ సెక్రటరీ అజేయ్‌కలాం కూడా ఈ కళాశాలలోనే విద్యనభ్యసించారు. ఎమ్మెల్సీగా చేస్తున్న డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఇక్కడి పూర్వవిద్యార్థితోపాటు కళాశాల ప్రొఫెసర్ కావడం విశేషం. ఐఏఎస్ అధికారి కాంతిలాల్‌దండే తోపాటు ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రాణిస్తున్న డాక్టర్ ఎస్.వి.ఎస్.శాస్త్రి, డాక్టర్ ఎన్.జి.పి.రావు, డాక్టర్ జి.ఎల్. కౌల్, డాక్టర్ సి.ఎస్.ఎస్.రావు, వంటి వారు కళాశాల పూర్వ విద్యార్థులే.

రైతుకు భరోసా.. పంటకు భద్రత

- గుంటూరు జిల్లాలో 29 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు
- ఒక్కో దానికి రూ.40 లక్షలు మంజూరు
- మొత్తం రూ.11.60 కోట్లు విడుదల
- గోడౌన్ సామర్థ్యం 500 మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు 11 సెంటర్ల పనులు పూర్తి
- 18 సెంటర్లలో వివిధ దశల్లో పనులు



అనంతవరప్పాడులో పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు

కొరిటెపాడు(గుంటూరు): ఎండనక, వాననక ఆరుగాలం శ్రమించే రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు విత్తు నుంచి దిగుబడి వరకు కావాల్సిన అన్ని రకాల సేవలు అందిస్తోంది. పెట్టుబడి సాయం కింద ప్రతి ఏటా రైతు భరోసా కింద రైతు ఖాతాలకు నగదు జమ చేస్తోంది. తాజాగా రైతులు పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధర వచ్చే వరకు భద్రంగా దాచుకునేందుకు వీలుగా మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లను నిర్మించి రైతులకు అండగా నిలుస్తోంది. ఎలాంటి ఆందోళన లేకుండా నిశ్చింతగా పంటలను గోడౌన్లలో భద్రపరచుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు వీలవుతుంది. ఒక్కో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌కు రూ.40 లక్షల పెట్టుబడితో 500 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు నిల్వ చేసుకుందుకు వీలుగా రూ.11.60 కోట్లతో 14,500 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో వాటిని నిర్మిస్తున్నారు.

జిల్లాకు 29 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు మంజూరు

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 29 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. ఇందులో ఒక్కో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌ను రూ.40 లక్షలతో 50 సెంట్ల స్థలంలో నిర్మిస్తున్నారు. వీటిని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్మిస్తున్నారు.

ఎక్కడెక్కడ నిర్మిస్తున్నారంటే..

జిల్లాలోని గుండ్లపాడు, పెనుమూలి, పెదపాలెం, కాజ, వడ్డేశ్వరం, కొలకలూరు, బుర్రిపాలెం, వల్లభాపురం, దావులూరు, కొల్లిపర, వెల్లలూరు, రేటూరు, కె.బి.పాలెం, చినలింగాయపాలెం, కారంపూడిపాడు, పుసులూరు, జొన్నలగడ్డ, వేములూరిపాడు, మేడికొండూరు, శిరిపురం, ఈమని, పెదరావూరు, తాళ్లపాలెం, ఉప్పరపాలెం, కసుకర్రు, నందూరు, సుద్దపల్లి, పెదకాకాని, అనంతవరప్పాడులలో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌లు నిర్మిస్తున్నారు. ఇందులో గుండ్లపాడు, పెదపాలెం, కాజ, కొలకలూరు, బుర్రిపాలెం, దావులూరు, కొల్లిపర, ఈమని, ఉప్పరపాలెం, పెదకాకాని, అనంతవరప్పాడులలో నిర్మించే గోడౌన్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వల్లభాపురం, వెల్లలూరు, పుసులూరు, శిరిపురం, తాళ్లపాలెం, కసుమర్రు, సుద్దపల్లిలలో నిర్మించే గోడౌన్ల పనులు బేస్‌మట్టం దశలో ఉన్నాయి. జొన్నలగడ్డ, వేములూరిపాడు, మేడికొండూరులలో నిర్మించే గోడౌన్ల పనులు ప్లాస్టింగ్ దశలో ఉన్నాయి. మిగతా గోడౌన్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఏదిఏమైనా మార్చి మాసం చివరికంతా పనులను పూర్తి చేసే దిశగా పనులు జరుగుతున్నాయి.

ఏయే వసతులుంటాయంటే...

ఈ మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌లలో రైతులు పండించిన పంటలను ఆరబెట్టుకొనేందుకు వీలుగా ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తారు. రైతు పండించిన పంట ఉత్పత్తులను తెచ్చి అమ్ముకోవచ్చు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా ఉంటాయి. అలా కాకుండా పంటలను అమ్ముకోని వారు గిట్టుబాటు ధర వచ్చే వరకు ఈ సెంటర్‌లలో భద్రపరచుకోవచ్చు. ఇలా అన్ని రకాల వసతులతో వీటిని నిర్మిస్తున్నారు.

శరవేగంగా పనులు

మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు జిల్లాలో శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో 11 గోడౌన్‌ల పనులు పూర్తి కాగా, మిగతావి బేస్‌మట్టం స్థాయితోపాటు ప్లాస్టింగ్ దశకు వచ్చాయి. సంబంధిత పనులన్నింటిని త్వరితగతిన మార్చి మాసం చివరి నాటికి పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. పనులు పూర్తయిన వెంటనే వాటిని సహకార సంఘాలకు అప్పగించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తారు.

-ఐ.నారాయణ, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ).

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 573.80 అడుగుల వద్ద ఉంది. ఇది 266.1074 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 9,443, ఎడమ కాలువకు 6,478, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,694, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 26,735 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 26,735 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 847.10 అడుగుల వద్ద ఉంది.

భళా.. గురుదేవా

- ఆదర్శనీయుడు అంధ ఉపాధ్యాయుడు నాగాంజనేయులు
- పుట్టుకతోనే అంధత్వం
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత విద్య



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న నాగాంజనేయులు

జే.పంగులూరు: అంధుడని అతను కుంగిపోలేదు. సమాజాన్ని చూడలేకపోతున్నానని బాధపడలేదు. చుట్టూ ఉన్న తన స్నేహితుల్లా ఆడుతూ పాడుతూ ఉండటం లేదని కృంగి పోలేదు. తన బతుకు ఇంతేనని నిరాశ చెందలేదు. తన పరిస్థితికి కుంగిపోకుండా ఎలాగైనా చదువుకోవాలని, తన చదువే ఉన్నత స్థాయికి తీసుకుపోతుందని చిన్న వయసులోనే తీర్మానించుకున్నాడు. కష్టపడి చది ఉపాధ్యాయుడిగా మంచి ఉద్యోగం సంపాదించి ఎంతో మందికి ఆదర్శనీయుడయ్యాడు నాగాంజనేయులు. ఆయనది బాపట్ల జిల్లా, పంగులూరు మండలంలోని చిన్నమల్లవరం గ్రామం. బస్సు సౌకర్యం కూడా లేని మారుమూల గ్రామంలో చిలుకూరి హనుమంతురావు, భాగ్యలక్ష్మిలకు రెండో సంతానంగా పుట్టాడు. నాగాంజనేయులు పుట్టుకతోనే అంధుడు. ఆయన కంటే ముందు పుట్టిన బాబు చనిపోయాడు. అతను పుట్టుకతో అంధుడు. నాగాంజనేయులు తరువాత పుట్టిన ఆడపిల్ల చనిపోయింది. ఆడపిల్ల పుట్టుకతోనే అనారోగ్యంతో పుట్టింది. దీంతో నాగాంజనేయులు ఒక్కడే సంతానం అయ్యాడు.

విద్యలో చురుకుగా..

అంధుడైనప్పటికీ తోటి విద్యార్థులతో గ్రామంలోని పాఠశాలకు వెళ్లడం, టీచర్ చెప్పే పాఠాలు వినడం, వాటిని టీచరుకు అప్పచెప్పడం చేస్తూ 4వ తరగతి వరకు గ్రామంలోనే చదివాడు. చుట్టుపక్కల వాళ్లు చులకనగా చూడటం వలన ఎప్పుడు ఇంట్లోనే ఉండే వాడు. 13 ఏళ్ల వరకు ఇంట్లోనే ఉండి టేప్ రికార్డులో పాటాలు వింటూ తను ఎలాగైనా చదువుకోవాలని, సమాజంలో గౌరవంగా బతకాలని నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలలో చేరాడు. అక్కడ బ్రెయిలీ లిపిలో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు చదివాడు. అక్కడ వాతావరణం నచ్చక 16వ ఏటా నర్సరావుపేటలోని లూధరన్ హైస్కూల్లో ఫర్‌ది బ్లైండ్ స్కూల్లో 4వ తరగతిలో చేరాడు. బ్రెయిలీ లిపిలో నిష్ణాతులైన ఉపాధ్యాయుల వద్ద శిక్షణ తీసుకుంటూ పదో తరగతి పూర్తి చేశాడు. అనంతరం ఇంటర్మీడియెట్ నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో, బీఏ కూడా అక్కడే పూర్తి చేశాడు. 2002లో డిగ్రీ పూర్తి చేసిన నాగాంజనేయులు 2005-06లో ఎడ్‌సెట్ రాసిన సీటు రాలేదు. తరువాత పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో సీటు రావడంతో, తెలుగు పండిట్ చేసి, 2008లో జరిగిన మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించాడు.



కుటుంబ సభ్యులతో నాగాంజనేయులు

ఉపాధ్యాయునిగా..

సంతమాగులూరు మండలం సజ్జాపురంలో ఎంపీయూపీ పాఠశాలలో తెలుగు పండింట్ గ్రేడ్-2 ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన నాగాంజనేయులు తరువాత తాళ్లూరు మండలం నాగంభట్లవారిపాలెంలో పనిచేశాడు. 2019లో ప్రమోషన్‌పై తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా బూదవాడ జిల్లా పరిషత్ పాఠశాలలో చేరాడు. 2013లో గుడివాడకు చెందిన సాయిశివలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. ప్రజ్వల, తన్విష్క ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. వివాహం రాకముందు తన తోటి వికలాంగుల సంక్షేమం కోసం వివేకానంద అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ అనే సంఘాన్ని స్థాపించి దానిలో కొంత కాలం అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేశాడు. వికలాంగుల రిజర్వేషన్, పెన్షన్ల ఇతర సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసి కొన్ని ఫలితాలు సాధించారు. కొంత కాలం చీమకుర్తి డాక్టర్ బీ జవహర్ సారథ్యంలో కొంత లయన్స్ క్లబ్‌లో 30 మంది అంధ విద్యార్థులకు పాఠాలు బోధించాడు. ఇంటి నుంచి పాఠశాలకు వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు తన భార్య సహాయ సహకారం అందిస్తుందని చెప్పాడు.

ఎంతో గర్వంగా ఉంటుంది

నా భర్త అంధుడని నేనెప్పుడు బాధపడలేదు. కష్టపడి చదివి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. ఎంతో మంది విద్యార్థులకు విద్య నేర్పుతుంటే నాకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. నా భర్తతో పిల్లలతో చాలా సంతోషంగా ఉన్నా .

– సాయి శివలక్ష్మి, నాగాంజనేయులు భార్య

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపింది కాంగ్రెస్సే

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రరాజు

చీరాల రూరల్: దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించి దేశాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేసింది కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. మంగళవారం ఆయన చీరాలలో పర్యటించారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ జేడీ శీలం, బాపట్ల జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, పీసీసీ సభ్యుడు సయ్యద్ అలీంబాబు, దేవరపల్లి రంగారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలోపేతం చేస్తాం

బాపట్ల అర్బన్: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఏపీ పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రలో భాగంగా బాపట్ల జిల్లా కన్వీనర్ గంటా అంజిబాబు నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి మేయప్పన్, పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి మస్తాన్ వలి,దోనేపూడి దేవరాజు ఉన్నారు.

శభాష్ శ్వేత

- 42 పతకాలతో కరాటే, జూడోలో ప్రతిభ
- చిన్న వయసు నుంచే సత్తా
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్వర్ణ పతకాలు
- ఒలంపిక్స్‌లో పతకం సాధిస్తానంటున్న నవతరం క్రీడాకారిణి

అద్దంకి: రిఫరీ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే చాలు ఒక్క దూకు దూకి పతకాలు పట్టుకొచ్చే దిట్ట. రాష్ట్రం అయినా, జాతీయ స్థాయి అయినా ఎక్కడైనా సరే రింగ్‌లో అడుగు పెడితే గెలుపు ఆమెదే. చిన్న తనంలోనే కరాటేలో విశేష ప్రతిభ చూపి అందరినీ ఔరా అనిపించిన చిచ్చర పిడుగు. బంగారు పతకాలతో మెరిసి శభాష్ అనిపించుకుంటున్న నవతరం క్రీడాకారిణి. ఆమె పేరు శ్వేతారెడ్డి. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని ధర్మవరం స్వగ్రామం. మేడగం వెంకట కృష్ణారెడ్డి గారాలపట్టీ. చిన్న వయసులోనే కరాటేపై మక్కువ పెంచుకుంది. తండ్రి కృష్ణారెడ్డి ప్రోత్సాహంతో నాలుగో తరగతిలో గురువు శ్యామ్ వద్ద కరాటే నేర్చుకుంది. 2016లో ఐదో తరగతి చదువుతున్న సమయంలో ముంబాయిలో జరిగిన పోటీల్లో భారత్ స్పోర్ట్స్ అవార్డుతోపాటు గోల్డ్ మెడల్, ఢిల్లీలో జరిగిన పోటీల్లో మరో గోల్డ్ మెడల్ సాధించింది. 2017లో శ్రీలంకలో జరిగిన పోటీల్లో బంగారు పతకం, 2018లో విశాఖపట్టణంలో నిర్వహించిన కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. 2018లోనే జూడో పోటీల వైపు ఆకర్షితురాలైంది. హైదరాబాద్‌లో అజీజ్



పతకాలతో శ్వేతారెడ్డి

వద్ద రెండేళ్లు కోచింగ్ తీసుకుంది. జపాన్ నుంచి వచ్చిన ఒక కోచ్ వద్ద కూడా తర్ఫీదు పొందింది. నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు, మధ్యప్రదేశ్‌లో గుడ్ అవార్డుతోపాటు నిజామాబాద్‌లో నిర్వహించిన జూడో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. మొత్తం 42 బంగారు పతకాలు, అవార్డులు పొంది ప్రశంసలందుకుంది. గతంలో ఎంపీలంతా రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం దీక్ష చేస్తున్న సమయంలో తన మద్దతు తెలిపి, ఎంపీ విజయసాయిరెడ్డి మన్ననలు అందుకుంది. ప్రజా సంకల్ప పాదయాత్ర సమయంలో నాగులపాడు వద్ద ప్రతిపక్ష నేతగా ఉన్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్వేతారెడ్డి ప్రతిభను చూసి అభినందించారు.

ఒలంపిక్స్‌లో పతకం తెస్తా..

ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నా. నాకు మంచి కోచ్ అవసరం. విద్య పరంగా ఇబ్బందిగా ఉంది. త్వరలో మంచి కోచ్ వద్ద కోచింగ్ తీసుకుని ఒలంపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం తెస్తా.

– శ్వేతారెడ్డి, కరాటే క్రీడాకారిణి

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పర్చూరు: అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు బాపట్ల డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పర్చూరు పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ పర్చూరులోని ఇందిరా కాలనీలో మతిస్థిమితం లేని యువతిపై ఇదే కాలనీకి చెందిన మిండాల సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ కేసులోని నిందితుడు సుబ్రహ్మణ్యంను మార్టూరు సీఐ ఫిరోజ్ పర్చూరు వైజంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడికి రెండు వివాహాలు జరిగినట్లు తెలిపారు. మొదటి భార్య మృతి చెందగా, రెండో భార్య విడిచిపెట్టిందన్నారు. కిరణా షాప్‌కు వచ్చే మతిస్థిమితం లేని యువతిని బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులుగా ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై జీవీ చౌదరి పాల్గొన్నారు.

కాలువలో కొట్టుకొచ్చిన వృద్ధుడి మృతదేహం

వేటపాలెం: కాల్వ నీటిలో వృద్ధుడి మృతదేహం మంగళవారం కొట్టుకొచ్చింది. రామన్నపేట వద్ద గల స్ట్రయిట్ కట్ కాల్వలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జి.సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు రావూరిపేటకు చెందిన గుత్తి వెంకట సుబ్బారావు (85)గా గుర్తించారు. వృద్ధుడు మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి కనిపించలేదని స్థానికులు తెలిపారు. ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడా, లేదా ఆత్మహత్యా అనేది తెలియాల్సి ఉంది.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



అన్నంబొట్లవారిపాలెంలో బండలాగుతున్న ఎడ్ల జత



సబ్ జూనియర్స్ విభాగంలో బండలాగుతున్న ఎద్దు

పర్చూరు: సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తునన జాతీయస్థాయి ఎడ్లపోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 35వ జాతీయస్థాయి బండలాగు ఎడ్ల బలప్రదర్శన పోటీ లు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి ఆరు పళ్ల విభాగంలో జరిగిన విజేతల వివరాల ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శివచక్రవర్తి, పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బత్తుల చిన్నబ్బాయి యాదవ్, పద్మావతి ఎడ్ల జతలు 5524.8 అడుగుల దూరం లాగి సంయుక్తంగా మొదటి బహుమతి గెలుచుకున్నాయి. చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నానికి చెందిన షేక్ సత్తార్ ఎడ్ల జత 5327 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి, వినుకొండకు చెందిన బత్తుల చిన్నబ్బాయ్‌యాదవ్, పద్మావతి యాదవ్ ఎడ్లజత 5100 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకున్నాయి. కృష్ణాజిల్లా గన్నవరం మండలం తెంపల్లికి చెందిన జొన్నలగడ్డ దేవతా తారావు ఎడ్ల జత 5100 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి, పల్నాడు జిల్లా శావల్యపురం మండలం మతుకుమల్లికు చెందిన ముంద్రు మల్లయ్య బ్రదర్స్ ఎడ్లజత 4884.7 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని గెలుచుకున్నాయి.

పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన పిక్కిలి తేజస్సు మురళి, వెంకటరావు చౌదరి ఎడ్ల జత 4800 అడుగుల దూరం లాగి సంయుక్తంగా ఆరో బహుమతిని గెల్చుకున్నాయి. పెదకాకాని మండలం తక్కెళ్లపాడుకు చెందిన మందపాటి లింగయ్యచౌదరి ఎడ్లజత 4510.5 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిని గెల్చుకోగా, నర్సరావుపేట మండలం లంకెల కూరపాడు చెందిన మేరువా హనివిరెడ్డి ఎడ్ల జత 4507.6 అడుగుల దూరం లాగి ఏనిమిదో బహుమతి గెల్చుకుంది. మంగళవారం రాత్రి సేద్య విభాగంలో పోటీలు జరుగుతున్నాయి. మొత్తం 8 జతలు పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన నల్లమోతు వీరయ్య చౌదరి ఎడ్ల జత 4500 అడుగుల దూరం లాగాయి. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన ఈశ్వర్ ప్రణయ్ కుమార్ యాదవ్ ఎడ్ల జత 3300 అడుగుల దూరం లాగాయి.

ఒంగోలు గిత్తల బలప్రదర్శన..

అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో నిర్వహిస్తున్న 35వ జాతీయస్థాయి ఒంగోలు గిత్తల బలప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి న్యూకేటగిరి విభాగంలో విజేతల వివరాల ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీష చౌదరి ఎడ్ల జత 5400 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకున్నాయి. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం కాటంవారిపల్లెకి చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లజత 5328.5 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి సాధించా యి. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలేనికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి ఎడ్లజత 5100 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెలుచుకోగా, పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమేట్లకు చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్లజత 5100 అడుగుల లాగి తృతీయ బహుమతిని గెల్చుకున్నాయి. ప్రకాశం జిల్లా కంభం మండలం దర్గాకు చెందిన మేకల రాజులు ఎడ్లజత 4500 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని గెల్చుకున్నాయి. సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన రాయపాటి శ్రీనివాసరావు ఎడ్లజత 4369.10 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని గెలుచుకున్నాయి. ప్రకాశం జిల్లా పెద్దారవీడుకు చెందిన గొట్టం రంగలక్ష్మమ్మ ఎడ్లజత 3991.5 అడుగుల దూరం లాగి ఆరో బహుమతి, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలకు చెందిన సూర్య అష్విక్ యాదవ్ ఎడ్లజత 3932 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిని గెల్చుకున్నాయి. మంగళవారం సాయంత్రం సబ్‌జూనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతున్నాయి.

తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేల విజేత బేస్తవారిపేట

కొత్తపట్నం: తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలస్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలో తెలంగాణ జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన ఏఎస్పీ సుంకి సురేంద్రరెడ్డి ఒక ఎద్దు, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం ఖాజీపురం గ్రామానికి చెందిన వెగనాటి ఓసూరారెడ్డి ఒక ఎద్దు కలిసి పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచాయి. మండలంలోని పాదర్తి గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం రాత్రి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల స్థాయి న్యూకేటగిరీ ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 11 జతల ఎడ్లు పాల్గొని పోటీ పడగా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ఎడ్ల జత 5,781 అడుగులు లాగి ప్రథమ బహుమతి లక్ష రూపాయలు కైవసం చేసుకుంది. వీరికి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మూగా బాలాజీ నగదు బహూకరించారు. చీమకుర్తి మండలానికి చెందిన జంగా విజయభాస్కర్‌రెడ్డి ఎడ్ల జత 5,379 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలవగా రూ.50 వేల నగదును చెరుకూరి వీరరాఘవరావు, ఉషారాణి బహూకరించారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్ల జత 5,379 అడుగులు లాగి తృతీయ బహుమతి కైవసం చేసుకోగా రూ.40 వేల నగదును యలగాల ఆదినారాయణ అందజేశారు. దర్శి మండలానికి చెందిన గానుగపంట రాజశేఖర రెడ్డి ఎడ్ల జత 4,800 అడుగులు లాగడంతో నాలుగో బహుమతి రూ.30 వేల నగదును పాలేటి ఆంజనేయులు, శ్రీదేవి పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన గాదె శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 4,407 అడుగులు లాగి ఐదో బహుమతి కైవసం చేసుకోగా రూ.20 వేలు ఎంపీటీసీ సభ్యురాలు గుడి అరుణ, నాగిరెడ్డి బహూకరించారు. బేస్తవారిపేట మండలానికి చెందిన గంగూలి బ్రదర్స్ ఎడ్ల జత 3,898 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలవగా రూ.15 వేలు మాజీ సర్పంచ్ జజ్జర హరినారాయణ అందించారు. ఎన్టీఆర్ జిల్లా జూపూడి మండలానికి చెందిన పీతా వెంకటేశ్వరరావు ఎడ్ల జత 3,830 అడుగులు లాగి ఏడో బహుమతి గెలుచుకోగా రూ.12 వేలు పాకల చిరంజీవి సతీమణి వెంకటేశ్వరమ్మ నగదు బహూకరించారు. కొత్తపట్నం మండలానికి చెందిన పల్లెకొండ సాయిప్రసాద్ ఎడ్ల జత 2 వేల అడుగులు లాగి ఎనిమిదో బహుమతి సాధించగా రూ.10 వేలు పాదర్తి సర్పంచ్ కట్టా సౌందర్య, చంద్రశేఖర్ నగదు అందించారు. తొమ్మిదో బహుమతి ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన కోమట్ల సాయితేజ ఎడ్ల జత 1,300 అడుగులు లాగి కైవసం చేసుకోగా రూ.8 వేల నగదును పంత్రంగం బ్రహ్మయ్య అందజేశారు.



బహుమతులను అందజేస్తున్న ఎంపీపీ

వేమన జయంతి ఉత్సవాలు రేపు

మోదుకూరు(వేమూరు): బాపట్ల జిల్లాస్థాయి చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలోని వేమన సాహిత్య వికాస పరిషత్ భవనంలో ఈ నెల 19న వేమన పద్య పఠన పోటీలు నిర్వహించడం జరుగుతుందని వేమన జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, అచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కులపతి అచార్య పి.రాజశేఖర్, ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సలహాదారు సహకార వాణిజ్య శాఖ బత్తుల బ్రహ్మనంద రెడ్డి పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు వేమన పద్య పఠన పోటీ విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

బీచ్ కబడ్డీ విజేత శ్రీకాకుళం



గెలుపొందిన శ్రీకాకుళం జట్టు



గెలుపొందిన విశాఖ జట్టు

ఒంగోలు రూరల్: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఒంగోలు రూరల్ మండలం కరవది వేదికగా ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించిన జాతీయ మహిళా బీచ్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారం రాత్రి నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు తలపడగా శ్రీకాకుళం టీం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో విశాఖపట్నం, తృతీయ స్థానంలో విజయ నగరం, నాలుగో స్థానంలో గుంటూరు, ఐదో స్థానంలో ప్రకాశం, ఆరో స్థానంలో పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి.

మాజీ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు శిరిగిరి రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. ఫైనల్ మ్యాచ్‌కు ముందు నిర్వహించిన సభలో డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ కుర్రా భాస్కరరావు, ఉపాధ్యక్షురాలు సుమతి, సీఐటీయూ ప్రెసిడెంట్ కాలం సుబ్బారావు, పారిశ్రామికవేత్త ప్రభాకర్, డాక్టర్ రామారావు, ఒంగోలు విద్యుత్ డీఈ రఘుబాబు, రాష్ట్ర రెఫరీ బోర్డు చైర్మన్ కంచర్ల బాబు మాట్లాడారు. అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. గుంటూరు జిల్లా క్రీడాకారిణి ఆర్.భారతి పుట్టినరోజు వేడుకను అతిథుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పోటీలకు రెఫరీలుగా రెఫరీ సంఘ చైర్మన్ కె.బాలు, రామకృష్ణ, అప్పలస్వామి, గణపతిరావు, సత్యానారాయణ, బసవయ్య, గోపి, సుమన్ వ్యవహరించారు. నిర్వాహకులు అంచిపోగు వెంకటేశ్వర్లు, గొలిమి శ్రీనివాసరావు, శిరిగిని అంజయ్య, ఆర్.జయకర్, జి.వేణు, కృష్ణచైతన్య, గుట్లపల్లి రవి, రమేష్, మణికంఠ, కోటి, వెంకటేష్, సతీష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాలూకా సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు, మహిళా కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు.

కంప్యూటర్లు దొంగిలించిన మైనర్లు అరెస్టు

చీరాల: సచివాలయంలో కంప్యూటర్లు, ప్రింటర్, లామినేషన్ మిషన్‌ను దొంగిలించిన కేసులో ఇరువురు మైనర్లను అరెస్ట్ చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన చీరాల మండలంలోని రామనగర్ ఎస్సీకాలనీ రెండో వార్డు సచివాలయంలో కంప్యూటర్లు, ప్రింటర్, ల్యామినేషన్ మిషన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి దొంగలించారని వార్డు అడ్మిన్ ఎస్ఎస్ఎన్ భవాని పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ ఆధ్వర్యంలో ఎస్సైలు నాగరాజు, సురేష్‌లు బృందంతో దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం చీరాల రామనగర్ ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇరువురు బాలురులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు నేరాన్ని అంగీకరించారన్నారు. అలానే చీరాల మరియమ్మపేటలో ఓ ఇంటి తాళాలు పగలకొట్టి రూ.5 వేలు దొంగతనం చేసినట్లు అంగీకరించారన్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1 లక్ష విలువ గల ఒక సీపీయూ, ప్రింటర్, రెండు మానిటర్లు, ఒక ల్యామినేషన్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కొద్దిరోజుల వ్యవధిలోనే కేసును ఛేదించిన సీఐ సోమశేఖర్, ఎస్సైలు నాగరాజు, సురేష్, సిబ్బంది బాజిత్, శివప్రసాద్, అహ్మద్ బాష, సుబ్బారావులను ఎస్పీ అభినందించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ సోమశేఖర్

కూచిపూడి నాట్యాచార్యుడు శ్రీమన్నారాయణకు అమృత అవార్డు

బాపట్ల అర్బన్: పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యాచారులు మహంకాళి శ్రీమన్నారాయణ అమృత్ అవార్డుకు ఎంపికయ్యారు. అజాదికా అమృత్ మహోత్సవంతో భాగంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ దేశంలోని కూచిపూడి కళాకారులల్లో నాట్య వయోధుకులైన శ్రీమహంకాళి శ్రీమన్నారాయణను అమృత్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును ఈనెల 26వ తేదీ దేశ రాజధానిలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు. అవార్డు గ్రహీత శ్రీమన్నారాయణ బాల్యం నుంచే నాట్యంపై మక్కువతో చింతా కృష్ణమూర్తి వేదాంతం పార్వతీశంతో పాటు తన తండ్రి వద్ద నాట్యంలో శిక్షణ పొందారు. యక్షగానంలో చిన్నతనంలోనే ప్రహ్లాదునిగా అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చి మహనీయుల మన్ననలు పొందారు. కృష్ణా జిల్లా కూచిపూడికి చెందిన శ్రీమన్నారాయణ తన 18వ ఏటా బాపట్లకు వచ్చి స్థిరపడ్డారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదిగి కూచిపూడిలో యక్షగాన చక్రవర్తిగా ఖ్యాతి గడించారు.

బాపట్ల నాట్యాచారుడుగా రాణించిన మహంకాళి శ్రీమన్నారాయణ సుమారు మూడు వేల మందికి పైగా నృత్యకారులను తీర్చిదిద్దారు. ఆయన శిష్యురాలు హైదరాబాద్‌లో కూచిపూడి నాట్య అకాడమీని స్థాపించి గురువు అడుగుజాడల్లో నడుస్తూ ఎంతో మందిని నాట్యకళాకారులుగా తీర్చిదిద్దుతుందన్నారు.



శ్రీమన్నారాయణ